# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన–3 7, అక్టోబరు, 2014

అడవులను రక్షించేందుకు, పచ్చదనాన్ని కాపాడేందుకు, చెట్లను పెంచేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కోరారు. తెలంగాణకు వానలు వాపసు రావాలనే ఉద్దేశ్యంతోనే ప్రతిష్టాత్మకమైన తెలంగాణాకు హరిత హారం అనే కార్యక్రమాన్ని తీసుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి హరిత హారం కార్యక్రమం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మూడేళ్లలో తెలంగాణలో 230 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 120 కోట్ల మొక్కలను గ్రామాలలో, పట్టణాలలో; 100 కోట్ల మొక్కలను అటవీ ప్రాంతంలో, 10 కోట్ల మొక్కలను హెచ్ఎండిఏ పరిధిలో పెంచనున్నట్లు వెల్లడించారు. ఈ మొక్కలను పెంచి పెద్ద చేసేందుకు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని డిఎఫ్ఓలు, సోషల్ ఫారెస్టు డిఎఫ్ఓలతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రాంతం గతంలో దట్టమైన అడవులతో ఆకుపచ్చగా కనిపించేదని, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ లాంటి జిల్లాల్లో ఎంతో అడవి వుండేదన్నారు. ఇప్పుడు ఆ అడవి పూర్తిగా క్షీణించిందని, ఆక్రమణలు కూడా ఎక్కువయ్యాయని సిఎం అన్నారు. అడవిని కాపాడే విషయంలో కలెక్టర్లు చాలా కఠినంగా వ్యవహరించాలన్నారు. అటవీ భూములకు సంబంధించి పూర్తి వివరాలను డిఎఫ్ఓ ల ద్వారా తెప్పించుకుని పోలీసుల సహకారంతో అడవిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో మళ్లీ అటవీ భూముల దురాక్రమణ జరుగకుండా ఇప్పటి నుండే పకడ్బందీ చర్యలు చేపట్టాలని చెప్పారు. అడవిలో చెట్లు లేకున్నా చాలా చోట్ల వేర్లు వున్నాయని, అలాంటి వేర్లు మళ్లీ మొలకెత్తి చెట్లుగా మారేందుకు అవకాశం వుందని, ఈ విషయంలో కూడా దృష్టి పెట్టాలని చెప్పారు. కలెక్టర్లు తరచుగా అటవీ ప్రాంతాలను సందర్శించాలని కోరారు. మంచి వాళ్లకు మంచి వాళ్లుగా, దొంగలకు కాల యముడిగా కలెక్టర్లు వ్యవహరించాలని సూచించారు.

తెలంగాణకు హరిత హారం కార్యక్రమం నిర్వహణ కోసం రూ. 500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రతి రెండు మూడు గ్రామాలకు ఒక నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో ఏడాదికి సగటున 30 నుండి 40 వేల మొక్కలను పెంచాలని, ప్రతి నియోజకవర్గంలో ఏడాదికి సగటున 40 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ మొక్కలకు నీరు అందించేందుకు అవసరమైతే ప్రతి రెండు మూడు కిలోమీటర్లకు ఒక బోరు కూడా వేయాలని సూచించారు. జూలై మొదటి వారాన్ని పూర్తిగా హరిత హారం కార్యక్రమానికి అంకితం చేస్తామని, అన్ని స్థాయిల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందించేందుకు రూపకల్పన చేసిన డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ పనులను కూడా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జిల్లా స్థాయిలో ప్రజలకు వివరించాలని కలెక్టర్లను కోరారు. రాబోయే మూడేళ్లలో 12000 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరించాలన్నారు. మూడేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో కనురెప్ప మూసినంత వ్యవధి కూడా కరెంట్ పోకుండా సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లా స్థాయిలో కళాకారులు, కవులు, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ కార్యక్రమాల అమలు బాధ్యత కూడా కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి చెప్పారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేని విధంగా మార్గదర్శకాలను రూపొందించి, కలెక్టర్లకు తెలియజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం